మా దొరబాబు

మా కాంతానికి సంతానం అయిదుగురు: మహాలక్ష్మీ సమానులు ముగ్గురు; రాజమాన్య రాజపూజితులు ఇద్దరు. ఈ ఇద్దరిలో శ్రీరఘురామ యాజ్ఞవల్క్య జ్యేష్ఠుడు. యాజ్ఞవల్క్య మహాఋషిలాగ మేధావి కావాలని ఉద్దేశించే మా కాంతం వాడికా పేరు పెట్టింది.

అనేకసార్లు నాతో అన్నది మా ఆవిడ "వీడు అఖండమైన తెలివి తేటలు గలవాడు అవుతాడండీ" అని.

వాడి ముఖం చామనచాయలో కళకళలాడుతూ ఉంటుంది. వాడిది గంభీరమైన చూపు. ఠీవి అయిన నడక కూడానూ.

తల్లి, కాంతం, వాడిని దగ్గరకు తీసుకొని ముద్దాడి, "మా తండ్రి పెద్దవాడైన తరువాత గొప్ప ఉద్యోగం చేస్తాడు. దేవుడు వాడికి ఆయురారోగ్యాలు అనుగ్రహించాలె గాని, మా బాబు డిప్యూటీ కలెక్టరు ఉద్యోగం చెయ్యడూ?" అనేది.

"అంతకంటే పెద్ద ఉద్యోగం ఏమీ నీకు తోచింది కాదా?" అన్నాను నేను.

"అది కాకపోతే పోలీస్ సూపరెంటు. కాదంటారా? వాడు జనరల్ మానేజర్ ఆఫ్ ది మద్రాస్ అండ్ సదరన్ మహారాటా రైల్వే అవుతాడు, ఏమంటారు?" అన్నది కాంతం.

"ఓ. తప్పకుండా" అన్నాను నేను.

కాంతం మళ్ళీ వాడిని దగ్గరకు తీసికొని, ఇంకోసారి ముద్దాడి "ఏమండీ, మా బాబుకు ఏం తక్కువ! దొరబాబండీ" అంటుంది.

ఇల్లాంటి సమయంలో ఆ చిన్న వెధవ రఘు ఛాతీవిరిచి, నిఠారున నిల్చుని కాస్త నవ్వుకొంటాడు. ఇల్లాగ అనేకసార్లు జరుగుతూ వచ్చింది.

వేము ఇల్లాగ చాలాసార్లు అనటం మూలాన వాడూ గట్టిగా నిశ్చయించుకున్నాడు – ఎప్పుడో ఒకప్పుడు ఠఫీమని గొప్పవాడు కావాలని. ఎవ్వరూ

చెప్పకుండానే వాడికి కొన్ని గొప్ప గుణాలు అబ్బినై. ఎవరైనా బిచ్చగాడు ఇంటి ముందు కొచ్చి, దీనంగా అడిగాడో... వాడి దగ్గర కానీ ఉండనీయండి, అర్ధణా ఉండనీయండి, ఎంత ఉంటే అంతా రఫీమని ఇచ్చేసేవాడు. ఇచ్చేసిన తరువాత కూడా తనకు లేకపోయిందే అని విచారించేవాడు కాదు! బ్రాహ్మడికి యాయవారం పెట్టినా దోసెలితో పెట్టడు. వెండి కప్పుతో గాని బియ్యం తీసుకెళ్ళేవాడు కాదు.

"అబ్బో! రఘూకు దర్జా ఎక్కువైందే అమ్మా, వెండిగిన్నెతో గాని పాలు తాగట్టే" అని పెద్దపిల్ల తల్లితో అంటే, ఆవిడగారు "అంతే అమ్మా, వాడంతే" అనేదేగాని, వాడ్ని "అదేమిరా" అనేది కాదు.

ఈ సామాన్య కుటుంబంలో పుట్టి కూడా వాడు పిల్ల జమీందారులాగే జరుపుకొంటున్నాడు. ఇంతవరకూ వాడికి అవ్వల్ దర్జాగానే జరుగుతూ ఉన్నది.

ఆరోజు నేను స్నానం చేస్తున్నప్పుడే చిన్నవాడొచ్చి చెప్పాడు సూర్యం మామయ్య వచ్చాడని, నేనూ స్నానం త్వరగా పూర్తి చేసుకొని మేడపైకి వెళ్ళేసరికి సూర్యనారాయణ కుర్చీలో కూర్చుని కాంతంతో మాట్లాడుతున్నాడు. ఆవిడ గదిగుమ్మంలో తలుపు కానుకొని నుంచున్నది. ఆయన కుర్చీలో కూర్చుని సిగరెట్టు తాగుతున్నాడు.

మేమిద్దరం ఓహో అంటే ఓహో అనుకొన్న తరువాత, సూర్యనారాయణ అన్నాడూ –"ఏమోయ్, వీడే కదూ మీ పెద్ద అబ్బాయీ" అని. "అవును, వీడే" నన్నాను. "ఇట్రా నాయినా" అని పిల్చాడు వాడ్ని. మా అబ్బాయి ఆయనకు దగ్గరగా వెళ్ళి నుంచున్నాడు, ఠీవిగా. మర్యాదగా బ్లూషర్‌ను ఓడించిన 'నే' సేనాని నెపోలియన్ ముందు నించున్నట్లు. ఆయన వాడ్ని తన ప్రక్క కుర్చీలో కూర్చోబెట్టుకొని, నాతోఏదో విషయం చెప్పటానికి "వీడూ..." అని ఆరంభించాడు. ఇంతలో కాలుస్తూ ఉన్న సిగరెట్టు అయిపోవటం మూలాన కిటికీలోనుంచి బైటకు పారేసి పాకెట్‌లో నుంచి కొత్త సిగరెట్టు తీసి దానిమొనను నిప్పు పెట్టె మీద ఒక పద్ధతిలో, ఒక రిథిమ్‌లో ముమ్మాటు కొట్టాడు. అల్లా కొటుతూన్నపుడు ఆయన నా వంకా చూడలేదు, మా ఆవిడ వంకా చూడలేదు. కిటికీలోనుంచి దూరాన ఉన్న దేన్నో చూస్తున్నట్లుంది. ఆ కిటికీకి అవతల బాదం చెట్టు ఒకటుంది. దానికి వెనకాల తాటిచెట్లు గాలికి తలలూపుతున్నాయి. మరి ఆయన ఏం చూస్తున్నాడో నాకు తెలియలేదు. ఏదో

చెప్పబోయి ఆగటం చేత నేనూ ఆతురతతో అతనివైపు చూస్తూ కూర్చున్నాను.

ఆ విధంగా ఆయన సిగరెట్టుతో నిప్పు పెట్టెమీద ముమ్మారు కొట్టీ... సిగరెట్టు వెలిగించీ... ఏదో గొప్ప రహస్యం నాకు ఆదరణతో చెపుతున్నవాడిలాగ చూస్తూ ప్రతిమాటా నొక్కుతూ "వీడు చాలా గొప్పవాడు అవుతాడు" అన్నాడు ప్రసన్నవదనం తోనూ, గంభీరమైన గొంతుతోనూ.

ఆ మాటలు విన్న కాంతం ముఖం సంతోషంతో తొణికిసలాడింది. కాని ఆవిడ ఏమీమాట్లాడకుండా శ్రద్ధతో ఆయన మాటలు వింటానికి కుతూహలం కనపరిచింది.

"అవునవును, వాళ్ళ అమ్మకి కూడా అదే అభిప్రాయం. ఇంతకూ పెద్ద అయిన తరువాత వాడు ఎట్లాగ తయారు అవుతాడో మరి" అన్నాను.

"ఆఁహాఁహాఁహా, నీకింకా అర్థం కాలేదు. నేను తమాషాకు అన్నమాట కాదు, అనుభవం మీద చెబుతున్నాను. వాడి చూపుల్లో ఉంది, భాగ్యం అంతా. అది అట్లా ఉంచు. అసలు ఈ మర్యాద ఎక్కడ నేర్చాడోయి" అన్నాడు. అని, నన్ను అడిగితే లాభం లేదనుకొని ఆవిడగారివంక తిరిగి చూశాడు.

"వాడి మొఖం లెండి! ఏమన్నాడేమిటి?" అన్నది కాంతం.

మళ్ళీ మా సూర్యనారాయణ అందుకొన్నాడు: "ఇంటి ముందు కారు ఆపి, 'నాన్నగారు ఉన్నారా' అన్నాను. వీడు ముందుకొచ్చి 'ఉన్నారండీ, స్నానం చేస్తున్నారు, దయచేయండి' అన్నాడు."

"వాడంతేనండీ అన్నయ్యా. వాడికి కాస్త మాట మర్యాద తెలుసు" అన్నది కాంతం.

"అసలు పదేండ్ల కుర్రవాడికి అంత మర్యాద తెలియటమే గొప్ప విషయమనుకో! దాని తరువాత ఆ అన్న పద్ధతీ! ఎంత తమాషాగా అన్నాడోయ్! వినయానికి వినయం! మర్యాదకు మర్యాద!" అని ఆ స్నేహితుడు మెచ్చుకొన్నాడు మా అబ్బాయిని.

"ఇదీ ఒక గొప్పేనా ఏమిటండీ!" అన్నది కాంతం చప్పరిస్తూ. పైకి ఇల్లాగ అన్నా లోపల ఆమె ఎంతో సంతోషిస్తున్నది.

"అది గాదు అమ్మాయ్. అసలు సంగతి వినాలి నీవు. లోపలికి వచ్చానా. పైకి తీసుకొచ్చాడు. కుర్చీలో కూర్చోమన్నాడు. కూర్చున్నా. 'నాన్న ఏం జేస్తున్నా'డంటే, 'స్నానం జేస్తున్నారు. పది నిమిషాలలో వస్తారు' అన్నాడు. 'మీ అమ్మ ఏం జేస్తూందిరా' అంటే 'మీరు వచ్చారని చెప్పాను, వస్తున్నది' అన్నాడు. సరేనని కూర్చుని, ఒక సిగరెట్టు తగలేద్దామని జేబులో నుంచి పాకెట్ తీశాను. చూస్తే అందులో సిగరెట్లు లేవు. ఎట్లాగా అని ఆలోచిస్తున్నాను. వీడు చప్పున మేడమెట్ల దగ్గరకు వెళ్ళి 'అప్పీ' అని కేకేశాడు. అది మీ పనిజేసే పిల్లకదూ?"

"అవును" అని నేను తల ఊపాను.

"చూశావా, వాడి తెలివి? నాకు సిగరెట్లు కావాలన్న సంగతి గ్రహించాడు! ఏమిటంటావు? అది తెలివంటవా, కాదంటావా?

కాంతం నవ్వింది. నేనూ ఆమె ముఖం చూస్తూ "తెలివే మరి. తెలివి కాదూ" అన్నాను.

"అప్పుడే కాలేదు కథా! నేనూ సంగతి గ్రహించి 'ఇందవోయ్ డబ్బు. ఒక్క సిజరు పాకెట్టు తెప్పించు' అన్నాను. వీడు చిరునవ్వుతో, 'అక్కర లేదండీ' అంటూ ఆ అప్పితో ఏమో రహస్యంగా, నాకు వినిపించకుండా మాట్లాడాడు. అయిదు నిమిషాలైందో లేదో అప్పి పాకెట్టూ, నిప్పెట్టే నా బల్ల మీద పెట్టింది. చూశావా... ఆ మర్యాదకు చెబుతా!" అన్నాడు.

"ఏమిటోయ్, అంత గొప్పగా చెబుతావు! ఆ మాత్రం మర్యాద తెలియటం కూడా ఒక గొప్పే అంటావూ?"

"అదేమిటి అల్లా అంటావూ? నేను ఇన్స్యూరెన్స్ పని మీద రకరకాల మనుష్యుల ఇంటికి వెడుతుంటాను. సాధారణంగా బాగా భాగ్యవంతుల కొంపలకే వెడుతుంటాను. కాని ఇంత చిన్నవయస్సులో ఇంత మర్యాదగా ప్రవర్తించటం నేను చాలా అరుదుగా చూశాను" అన్నాడు.

ఈయన మా ఆవిడకు సయాం అన్నయ్య కాదు. నాకు బాల్యస్నేహితుడు. ఆ రీత్యా ఆవిడకు అన్నయ్య అయినాడు. అయితేనేం, స్వంత అన్నకంటే ఎక్కువ ఆపేక్షగా

ఈయన ఉంటాడు. స్వంత చెల్లెలు కంటే ఎక్కువ చనువుగా ఆవిడగారూ ఉంటుంది.

అదీ అసలు సంగతి. ఎప్పుడైనా ఈ ప్రాంతాలకు పని మీద వచ్చినప్పుడు మా ఇంటికి వచ్చి చూచి పోతుంటాడు.

- 2 -

మామూలు వేళకు భోజనాలైనై. నేను కాసేపు నిద్రపోయి, లేచి, క్రిందికి వచ్చాను. ఆయన ఇంకా నిద్రపోతూనే ఉన్నాడు. మా ఆవిడ మధ్యాహ్నం ఫలహారానికి కామాలు గారెలు చేస్తున్నది.

"అయితే, కాంతం, గారెలు చేస్తున్నావా, ఫలహారానికీ? మరీ... కాఫీ కూడా చేస్తావా?"

"మరి ఎండ మండిపోతూంటే కాఫీ ఏమిటండీ" అన్నది.

"మరి ఏమంటావూ?" అన్నాను నేను.

"ఏమీ వద్దు, కమ్మని గారెలు తిని కాసిని మంచినీళ్ళు తాగుతారు లెండి" అన్నది ఆవిడ.

"ఆ. కాస్త ఏదైనా షర్బతు లాంటిదైనా ఇస్తే బాగుంటుంది కాని బొత్తుగా మంచినీళ్ళు ఇస్తే ఏం బాగుంటుంది? అదీ నేననటం" అన్నాను నేను.

"మరేం ఫరవాలేదు. ఇప్పుడెల్లాగ వస్తుందీ షర్బతూ గిర్బతూను! బావిలోనుంచి తోడి చల్లటి నీళ్ళు ఇస్తాను చాల్లెద్దురూ?" అన్నది ఆవిడ.

"మన బావినీళ్ళు కాస్త ఉప్పనగదా కర్మం!"

"మరి ఏమంటారూ?"

"మంచినీళ్ళలో రెండు నిమ్మకాయలు పిండి కాస్త పంచదార వేసి ఇస్తే షర్బతులాగ ఉంటుంది, అవునా?"

"దానికైనా నిమ్మకాయలు కావాలిగా?"

"ఇంట్లో లేవూ?"

"ఊహూఁ"

"అయితే, నేను బజారుకు వెళ్ళి తీసుకొస్తాను" అన్నాను.

"మీరు నన్ను క్షమించాలె. ఈ ఎండలో మీరు బజారుకు వెళ్ళటానికి నేనొప్పుకోను. మీ వయస్సువాళ్ళు ఇంత ఎండలో తిరగకూడదు. అంతగా అయితే రఘూను పంపండి" అన్నది ఆవిడ.

"వాడు బజారుకెళ్ళీ...."

"మీకాసందేహం అక్కరలేదు, పంపండి... బాబూ, ఒరే రఘూ" అని పిలిచింది కాంతం. పెద్దబాబు దొరలాగ వచ్చి అమ్మకెదురుగా నుంచున్నాడు. అమ్మ కొడుకును చూచి ఆనందిస్తున్నది.

"నాయినా, బజారుకు వెళ్ళిరావాలరా!" అన్నాను నేను. "అల్లాగే" అన్నాడు దొరబాబు.

"చూశారా, నా తండ్రి ఎంత బుద్ధిమంతుడో! పోననిగాని, ఎండ అనిగాని అన్నాడేమో చూశారా? విధేయత - మర్యాద తెలుసండీ బాబుకూ" అన్నది మా ఆవిడ.

"ఏం తేవాల నాన్నా!" అన్నాడు బాబు.

ఆ సమయంలో వీధిలోకి వెళ్ళి ఏదైనా తేవటం అనే ఒక సాహసకార్యాన్ని వాడు సాధించాలని కుతూహలపడుతున్నాడే కాని ఎండలో పోవటం కష్టం అని వాడు అనుకోవటం లేదు. పితృవాక్య పరిపాలనార్థం ఎంత సాహసకృత్యమైనా చేయటానికి సిద్ధపడ్డవాడిలాగా, సిపాయిలాగా నుంచున్నాడు.

అప్పుడు నేనన్నాను - "నాయినా, ఇదిగో రూపాయి. బజారుకెళ్ళి, నాలుగు నిమ్మకాయలూ, ఒక పౌను మంచుగడ్డా తీసుకొని రావాలె"

సరేనని వాడు బయలుదేరాడు. "రూపాయి ఎక్కడైనా పారేస్తావేమోరోయ్" అన్నాను నేను. వాళ్ళమ్మ కూడా "జాగ్రత్తరా నాయినా" అన్నది. వాడేం మాట్లాడలేదు. కాని ఒక చిరునవ్వు మాత్రం నవ్వాడు. ఆ చిరునవ్వులో ఉన్న అర్థ విశేషాన్ని గురించి ముగ్గురు పండితులు నోట్సు వ్రాయాలిసినంత విషయముంది.

"ఒక్క రూపాయి జాగ్రత్తగా వాడలే ననేనా నీ అభిప్రాయం? పిచ్చిదానా...

ఒక్క రూపాయి ఏమిటి, వంద రూపాయలు ఇచ్చినా అంచక్కా జాగ్రత్తగా వాడగలను, తెలుసునా" అన్నట్లు అర్థమైంది మా ఇద్దరికీ.

"సరే నాన్నా, వెళ్ళు. చెప్పులు తొడుక్కుని గొడుగు వేసికొని వెళ్ళేం" అన్నది కాంతం.

వాడు వెళ్ళుతుంటే నిలబడిచూచి, కాంతం "ఎట్లా నడుస్తాడో చూశారా" అన్నది.

"ఏం, మామూలుగానే ఉంది" అన్నాను.

"మామూలుగా ఉందీ, వంకరకాళ్ళతో,... వంగి తూలుతూ నడిచేవాళ్ళకు... నడకలో ఉండే దర్జాతనం ఏం తెలుస్తుంది? – బెంగాలులో ఉంటారు చూశారూ, జమీందారులు, శరత్‌బాబు, హేమచంద్ర... అదిగో అల్లాంటివాళ్ళ నడక అబ్బాయిది".

"సరే, సరే, రైట్ – ఒప్పుకొన్నాను. అది సరే కాని మరి షర్బత్ ఇయ్యటానికి గ్లాసులు ఏవీ?"

"పింగాణీ గ్లాసులున్నయి కదండీ"

"ఎబ్బే, పింగాణీ గ్లాసులలో ఇవ్వటం ఏం కర్మం, మనకు వెండిగ్లాసు లుండంగా?"

"ఆ వెండిసామానులు ఎక్కడో ఉన్నాయి పైన. ఇప్పుడు ఎవరు తెస్తారు పోనిద్దురూ!"

"నా మాట విందూ, నేను తెస్తాను పైకెళ్ళీ!"

"మన భాగ్యం అంతా బైట పెట్టాలకామాలు?"

"ఏదో పోనిద్దూ అన్నానుగా"

"సరే, అల్లాగే కానీండి" అన్నది కాంతం.

"అబ్బాయి ఇంకా రాలేదేమబ్బా? చాలాసేపు అయిందే వెళ్లి! వాడికి రూపాయి కూడా ఇచ్చాను! ఏం జేసుకొస్తాడో! అన్నాను నేను.

"వాడి కేమీ తెలీయదనా మీ ఉద్దేశం? మీ కంటే బాగానే బేరం చేయగలడు.

మీకు అసలు బేరం చేయటం ఏమీ తెలియదు. ఒకటి తెమ్మంటే ఒకటి తెస్తారు. తెమ్మన్న వస్తువులలో సగం మర్చిపోతారు. మీ సంగతే చెప్పాలె! అయ్యో! అయ్యో! ఎందుకొచ్చిన అవస్థ! ఇక మీరు ఊరుకోండి. బజారు వస్తువులన్నీ వాడిచేత తెప్పించుకొంటాను!"

"తెప్పించుకొందువుగాని, ఇంకా రెండేళ్ళు పోనీ" అన్నాను.

"అయితే, మన అబ్బాయి తేలేడనే మీ ఉద్దేశం? చాలా పొరపడుతున్నారు. బేరం చేయటం తెలుసు వాడికి! కొసరు అడగటం తెలుసూ. అన్నీ తెలుసునండీ. మీకంటే వెయ్యి రెట్లు నయం. మొన్న వంకాయలు తెచ్చాడు. ఎల్లాంటివి తెచ్చాడు! లేత మొవ్వలు, నవనవలాడుతూ ఉన్నాయి".

"పుచ్చు వంకాయలు తెచ్చాడని నీవు విసుక్కున్నావు గదూ"

"లేతవి తెమ్మంటే లేతవి తెచ్చాడండీ. పుచ్చు సంగతి వాడికప్పుడు తెలిసింది కాదు. ఒక్కొక్క విషయమే చెపితే తెలుస్తుంది. ఇప్పుడు బజారుకు పంపారుగా చూడండి, మీరు చెప్పిన రెండు వస్తువులూ కొనుక్కొని వస్తాడు దొరబాబులాగ"

"దీనికేం భాగ్యంలే"

"అబ్బా, అంతేనా? పచ్చి మిరపకాయలు తెమ్మని మిమ్మల్ను బజారుకు పంపిస్తే మీరు ఆ రోజున ఏం జేసుకొచ్చారు జ్ఞాపకం లేదూ?"

"ఏం జేసుకొచ్చానేమిటీ?"

"ఏం జేసుకొచ్చారా? కాఫీ హొటల్లో కాసేపు గడిపి, ఆ తరువాత కూరలబజారుకెళ్లి వంకాయలూ, వెలక్కాయలూ తెచ్చారు. పచ్చి మెరపకాయల సంగతే మర్చిపోయినారు!"

"ఎందుకు అల్లాగ నవ్వుతావు? మర్చిపోతే మర్చిపోయి ఉండవచ్చు. వంకాయలు మటుకు పనికొచ్చే వస్తువులు కాదా?"

"అయితే, అప్పటికే ఇంట్లో రెండు వీసల వంకాయలున్నాయి. ఆ సంగతి మరిచిపోయి మళ్లీ వంకాయలు తెస్తే ఏం జేసుకోవాలె!! నెత్తినేసి కొట్టుకోవాలి? అల్లాంటివీ మీ పనులు! మా బాబును వదిలేస్తే ఇల్లాగే తయారవుతాడేమో! ఇప్పటినుంచీ

నేర్చుకొంటాను" అని అన్నది కాంతం.

"అల్లాగే చేయ్.... సరేగానీ, అబ్బాయి ఇంకా రాలేదే మబ్బా!"

"రావాలా మరి ఎండలో?"

"సరే. నీవు ఇంతలో స్నానంచేసి మంచి బట్ట కట్టుకో"

"ఏ చీర కట్టుకోమంటారూ?"

"పట్టుచీర"

"ఎందుకండీ పట్టుచీర ఇప్పుడూ?"

"ఎందుకో నాకు తెలియదు. అడిగావు కాబట్టి చెప్పాను" అన్నాను. ఇద్దరం ఊరికేనే నవ్వుకొన్నాం.

నేను మేడపైకి వెళ్లాను. నేనూ, ఆయనా క్రిందకి వచ్చేసరికి మా ఆవిడ వెండి పళ్లాల్లో మాకూ, పిల్లలకూ అందరికీ వడ్డించింది. రఘుగాడి పళ్లెం ఇంకా ఖాళీగానే ఉంది. ఇంకా రాలేదేమా అని ఆదుర్దా గలిగింది.

"ఫలహారం కానిస్తుంటే వాడే వస్తాడు ఆమటా" అని కూర్చున్నాం. ఆ తరువాత పది నిమిషాలకు వాకిట్లో బండేదో ఆగింది. పిల్లలు పరుగెత్తికెళ్లి రఘు వచ్చాడని కేకేశారు. పోనీలే సమయానికొచ్చాడని సంతోషించాము.

ఇంతలో రఘూ మా ఎదుట నుంచున్నాడు. "అదేమిట్రా నాయినా అట్లా ఉన్నావూ?" అన్నది వాళ్ళమ్మ. వాడి తలంతా తడిసి ఉంది. బట్టలన్నీ తడిసి ఉన్నాయి. వంటినిండా రంపపు పొట్టు కొట్టుకొంది.

"ఏమిట్రా నాయినా, ఇదంతా ఏమిట్రా" అంటూ వాళ్లమ్మ పమిటచెంగుతో తల తుడుస్తున్నది.

"వెధవ మంచుగడ్డే, కరగటం మూలాన రంపపు పొట్టు వంటినిండా పడ్డది" అంటూ ఆరంభించి గుక్క తిప్పకుండా చెప్పటం సాగించాడు.

"మొదట నిమ్మకాయలే కొన్నానే అమ్మా, వంద పావలా చెప్పాడు. కాని అణాకు పదే ఇస్తానన్నాడు. చిల్లరగా కొంటే నష్టమని యాభై నిమ్మకాయలూ కొన్నాను."

"చూశారా వాడి తెలివీ!" అన్నది వాళ్లమ్మ.

"ఆపళంగా అయిస్ ఫాక్టరీ కెళ్లి ఒక పౌను అయిస్ కొన్నాను. 'ఎందులో తీసికెడతావు' అన్నాడు ఆయన. పొట్లం కట్టి ఇయ్యమన్నాను. సరేనని ఆయన ఒక కాయితంలో రంపపుపొట్టుపోసి దానిలో ఈ అయిస్ పెట్టి పొట్లంగట్టి ఇచ్చాడు. ఒకచేత్తో నిమ్మకాయల సంచీ పట్టుకొని, నెత్తిన అయిస్ మూట పెట్టుకొని ఇంటికి బయలుదేరాను. కాని ఏమైందనుకొన్నావ్ అమ్మా, కొత్త బూడ్సులు కావూ ఇవీ - అందుకని చెప్పులూ, గొడుగూ అక్కడున్న సోడా షాపులో పెట్టి ఆపళంగా బయలుదేరాను. కూలి పెడదాం అనుకొన్నా కాని, ఆ వెధవే, 'ఈ ఎండలో అణా ఇస్తేగాని రానండీ బాబూ' అన్నాడు. అందుకని కూలీపెట్టక నేనే అయిస్ నెత్తిన పెట్టుకొని, నిమ్మకాయల సంచీ చేత్తో పట్టుకొని నడవటం మొదలుపెట్టాను.

"నా తండ్రే! మా నాన్న! చూశారా? కూలీకి అణా ఇయ్యాలని తానే మోసుకొచ్చాడు. మీ మొస్తరు అర్ధణా కూరకు అణా కూలీ పెట్టడు" అని నన్ను జూచి నవ్వి ఆవిడ కొడుకును ముద్దాడింది.

"అది గాదే అమ్మా, వినూ మరి. కోటవారి తుళ్ళ దగ్గరకు వచ్చేసరికి ఏమైందీ! మంచుగడ్డ కరిగి పొట్టు అంతా నా వంటినిండా పడ్డది. అదీగాక అది కరిగిపోతున్నది. బట్టలన్నీ తడిసిపోయినై. బరువు తగ్గింది. ఇంటికొచ్చేదాకా ఉండేటట్లు లేదూ! ఎండకు మంచు కరుగుతుందా? ఆ సంగతి నాకు ఇప్పుడు తెలిసింది!! ఇక లాభం లేదు, ఇంటికి పోయేటప్పటికి ఒక్క ముక్క అయినా మిగలదనుకొని ఆ పొట్లాం ఆ పక్కనే ఉన్న ప్రెస్ ఆఫీసులో పెట్టాను. మళ్ళీ వచ్చి తీసికెళ్లతానని చెప్పి నిమ్మకాయల సంచి తీసుకొని వస్తున్నానే. వస్తుంటే... ఏమైందీ, ఆ సందులో ఇసక... కాళ్లు మాడిపోయినయే. అందుకని నడవలేకపోయినాను. చెప్పులు కూడా లేవాయె! నడవలేక మళ్ళీ రోడ్డుమీదకి వచ్చాను. వచ్చి అక్కడొక జట్కా కనపడితే 'మా ఇంటికొస్తావోయ్' అన్నాను. వాడు 'మూడు అణాలు ఇస్తే కాని రానన్నాడు. బేరం చేసి చేసి ఎట్లాగయితేనేం చివరకు బేడ అర్ధణాకు కట్టించుకొని రయ్యిన వచ్చేశాను. నిమ్మకాయలు అర్ధపావలా, అయిస్ అణా, బండీకి బేడఅర్ధణా - పోతే పదణాలన్న రా ఇదిగో" అని చిల్లర నా చేతిలో పెట్టాడు.

"అయితే, రెండు నిమ్మకాయలు, అణా అయిస్ కలిసి అణాకానీతో పోయేదానికి అయిదు అణాలన్నర ఖర్చుచేసుకొచ్చాడు నీ కొడుకూ" అన్నాను మా ఆవిడతో.

ఆవిడ చిన్నబుచ్చుకొని "పోనీలెండి, చిన్న వెధవ! యాభై నిమ్మకాయలు తెచ్చాడూ, ఊరగాయ వేద్దామని అనుకొంటూనే ఉన్నాను. పిల్లలకు చద్ది అన్నాలలోకి అయినా ఉంటుంది" అని సరిపుచ్చుకొంది.

"ముందు రెండు కాయలు పిండూ" అన్నాను నేను.

"నాయనా! కాయలు ఎక్కడ పెట్టావురా నాయినా" అన్నది వాళ్ళమ్మ.

"అరెరే రే రే రే" - అని అంటూ, పండ్లు బిగించి తెల్లమొఖం వేసి వాకిట్లోకి – వీధి గుమ్మంలోకి ఒక్క గంతులో పరుగెత్తి, "ఎటుపోయిందే జట్కా" అని పసిదాన్ని అడుగుతున్నాడు.

('భారతి' మాసపత్రిక, ఏప్రిల్ – 1941)